క్లుప్తంగా

అంగన్‌వాడీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



నాగవరప్పాడు(గన్నవరం): ఉంగుటూరు మండలం నాగవరప్పాడు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ విద్యను పూర్తి చేసుకుని పాఠశాలలో అడుగుపెడుతున్న చిన్నారులకు ఐసీడీఎస్ సీడీపీఓ మంగమ్మ, సర్పంచ్ లాం నాగేశ్వరరావు చేతుల మీదుగా గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. పిల్లల్లో మెదడు పెరుగుదల పుట్టినప్పుడు 25 శాతం, ఐదేళ్లకు మిగిలిన 75 శాతం ఉంటుందన్నారు. ముఖ్యంగా ఆటపాటలతో కూడిన విద్యను అందించడం వల్ల అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల్లో తెలివితేటలు మరింత ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం వి.సప్తగిరినాథ్, సచివాలయ సిబ్బంది మధుసూదన్, మానస, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.పద్మాదేవి, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చండీ హోమం



కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమంలోని శ్రీపంచతత్వ గురుపాదుకా మందిరంలో బుధవారం అమావాస్య సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. తొలుత శ్రీగురు దత్తాత్రేయస్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు చంద్రశేఖర్, సరిత దంపతుల నేతృత్వంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం భక్తులచే శ్రీలలితా సహస్రనామ పారాయణం చేశారు. ఆశ్రమ ట్రస్టీ గొంది రాజా, మూల్పూరు మాధవన్, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తెంపల్లిలో వైద్య ఆరోగ్య బృందం పర్యటన



గన్నవరంరూరల్: మండలంలోని తెంపల్లిలో బుధవారం ఆత్కూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యాన ఫీల్డ్ సర్వే కార్యక్రమం జరిగింది. ఇంటింటికి వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. నీటి నిల్వలతోనే దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా జ్వరాలు ప్రబలుతాయని హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు తెలిపారు. అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. అతిసార వ్యాధి నుంచి పిల్లలను రక్షించుకోవాలన్నారు. ఎక్కువ సార్లు విరేచనాలు అయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఏఎన్‌ఎంలు జె.మంజుల, వి.విమల, ఆశా వర్కర్లు దుర్గ, మేరీ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

పెనమలూరు: యనమలకుదురులో వ్యక్తిని కారు ఢీకొన్న ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు ఇందిరానగర్‌కు చెందిన షేక్ అహ్మద్‌బాషా బావమరిది ఖాశీం రాడ్ బెండింగ్ పనులు చేస్తాడు. అతని భార్యతో విభేదాల కారణంగా ఒంటరిగా ఉంటున్నాడు. అతను మద్యం సేవించి మత్తులో గ్రామంలో పార్థసారధి కల్యాణ మండపం వద్ద రోడ్డు పక్కన పడుకున్నాడు. ఆ సమయంలో కారు వేగంగా వచ్చి అతని కాలు మీదుగా వెళ్లింది. దీంతో అతని కాలుకు గాయమైంది. అతనిని చికిత్సకు విజయవాడ ప్రభుత్వాస్పత్రికి చికిత్సకై తరలించారు. బాధితుడి బావ అహ్మద్‌బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

1న వైద్యులకు అవార్డుల ప్రదానం

లబ్బీపేట(విజయవాడతూర్పు): డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో జూలై 1వ తేదీన జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహించనున్నారు. అందులో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్న వారికి బెస్ట్ డాక్టర్ అవార్డ్స్ 2025 అందజేయనున్నారు. ఈ అవార్డులకు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొననున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదగా అందించనున్నట్లు వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. అవార్డులు అందుకుంటున్న వారిలో జనరల్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ ఎ.అశ్విని కుమార్, కార్డియాలజిస్టులు డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ పి. భాస్కరనాయుడు, జనరల్ సర్జన్, డీఎంఈ–ఏపీ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, డాక్టర్ జి.భవానీప్రసాద్, న్యూరోసర్జన్ డాక్టర్ కె. సత్యవరప్రసాద్, డాక్టర్ ఎం.కృష్ణ నాయక్, న్యూరాలజిస్ట్ డాక్టర్ పద్మ శ్రీవస్తవ, డాక్టర్ ఆర్.మురళీ బాబూరావు, ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ టి.భారతి ఉన్నారు.

ఖరీఫ్ ప్రారంభమైనా అందని సాయం

- సాగు పనుల్లో బిజీ
- పెట్టుబడి సాయం కోసం కౌలు రైతుల ఎదురుచూపు
- అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని ప్రభుత్వానికి వినతి



ట్రాక్టర్‌తో దుక్కులు దున్నుతున్న రైతు



నారుమళ్లకు నీరు పెడుతున్న రైతు

విజయవాడరూరల్: కూటమి ప్రభుత్వం కౌలు రైతులను పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ పంటలను సాగు చేయడంలో కౌలు రైతులే అధిక శాతం ఉన్నారని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నా, ప్రభుత్వ పరంగా వారికి ఎలాంటి పథకాలు వర్తించడం లేదని కౌలు రైతులు వాపోతున్నారు. గత వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో కౌలు రైతులకు సుమారు లక్షా 27 వేల మందికి గుర్తింపు కార్డులను మంజూరు చేసింది. పంటలు సాగుచేసేందుకు పెట్టుబడి సాయం కింద సొంత భూమి ఉన్న రైతులతో పాటు కౌలు రైతులకు రైతు భరోసా పథకం కింద ఒక్కొక్కరికి 13 వేల 500 రూపాయలను అందజేసింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన పిమ్మట అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు ప్రకటించిన పెట్టుబడి సాయం 20 వేల రూపాయలను కౌలు రైతులకు వర్తింపచేయకపోవడంతో వారు ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభించడానికి నానా అవస్థలు పడుతున్నారు. పెట్టుబడి సాయం కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి నోట్లు రాసి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొంటున్నారు.

గుర్తింపు కార్డులు ఇవ్వాలి..

దుక్కులు దున్నడం, నారులు పోయడం, నాట్లు వేసిన నాటి నుంచి వరిపైరులో ఎరువులు, కలుపులు తీయడం, పై మందులు కొట్టడం లాంటి, పనులు చేసి వాతావరణం అనుకూలంగా ఉంటే తప్ప పండిన పంట కోత దశకు చేరుకోదు. అందుకు గాను ఎకరానికి పెట్టుబడి 25 వేల రూపాయల నుంచి 30 వేల రూపాయల వరకు ఖర్చు అవుతుందని కౌలురైతులు చెబుతున్నారు. వ్యవసాయ భూములున్న రైతులు దేశ, విదేశాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉంటున్న రైతుల పేర రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం పేరుతో పెట్టుబడి సాయం బ్యాంక్ ఖాతాలకు డిపాజిట్ చేస్తోంది. కానీ వాన అనక, ఎండనక అనేక అవస్థలు పడుతూ పంటలు సాగు చేసి తిండి గింజల కొరత రాకుండా పండిస్తున్న కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించక పోవడం శోచనీయం. కౌలు రైతులకు గ్రామ స్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి కౌలు గుర్తింపు కార్డులను అందించాల్సిన అవసరం ఉంది. గుర్తింపు కార్డుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల ఆర్థిక సహాయం అందించాలని కౌలు రైతులు కోరుతున్నారు.



పంటలకు పెట్టుబడి ఇవ్వాలి..

వ్యవసాయ పంటలను పండిస్తున్న కౌలు రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇవ్వాలి. కూటమి ప్రభుత్వం సొంత భూమి ఉన్న వారికి అన్నదాత సుఖీభవ పథకంలో ఇస్తున్నారు. అదే విధంగా కౌలు గుర్తింపు కార్డుతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని ప్రతి కౌలు రైతుకు ఈ పథకం వర్తింపచేయాలి.

– పి.హరిబాబు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి



పెరుగుతున్న ఖర్చులతో అవస్థలు

రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కౌలు రైతులకు పెట్టుబడి సహాయం ఎకరానికి 20 వేల రూపాయలు అందజేయాలి. పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో అప్పుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో సాగు భారంగా మారుతోంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– కొక్కిలిగడ్డ చంద్రశేఖర్, కౌలు రైతు, అంబాపురం గ్రామం



పెట్టుబడి సహాయం అందజేయాలి

వ్యవసాయ పంటలను సాగు చేసే ప్రతి కౌలు రైతుకు ప్రభుత్వం పెట్టుబడి సహాయం కింద అన్నదాత సుఖీభవ పథకంలో ఎకరానికి 20 వేల రూపాయలు అందించాలి. గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఈ ప్రభుత్వం కూడా కౌలు రైతులకు సహాయం అందించాలి. పెట్టుబడి సాయంతో ఆర్థిక వెసులుబాటు కలుగుతోంది.

– దేవరపల్లి సుబ్బారావు, కౌలు రైతు, అంబాపురం గ్రామం

పారిశుద్ధ్య కార్మికులకు అందని జీతాలు



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులకు ఈ నెల జీతాలు నేటికీ అందలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లిస్తామని ప్రకటనలు చేసిన నేతల మాటలు నీటి మూటలుగా మారాయి. తాడిగడప మున్సిపాలిటీలో కార్మికులు దాదాపు 430 మందికి పైగా పని చేస్తున్నారు. మున్సిపాలిటీలో ప్రతి రోజు వర్షం, మండుటెండను సైతం లెక్కచేయకుండా పనులు చేస్తున్నారు. మున్సిపాలిటీలో అధికారులు, సిబ్బంది మాత్రం ప్రతి నెల 1వ తేదీన జీతాలు తీసుకుంటుంటే, పారిశుద్ధ్య కార్మికులకు మాత్రం జీతాలు సకాలంలో ఇవ్వడం లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హజరత్తయ్య గుప్తాకు అవార్డు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బహుముఖ ప్రజ్ఞాశాలి వేముల హజరత్తయ్య గుప్తా అని ఆయనకు అంతర్జాతీయ సేవా ప్రశంస చెవరాన్ అవార్డు రావటం గర్వకారణమని లయన్స్ క్లబ్ గవర్నర్ గద్దే శేషగిరి అన్నారు. ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ వేముల హజరత్తయ్య గుప్తాకు లయన్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పట్టి హిల్ ప్రశంసాపత్రంతో పాటు చెవరాన్ అవార్డు బ్యాడ్జీని పంపించారు. ఈ మేరకు మాచవరం హరియత్ లయన్స్ సేవా భవన్‌లో బుధవారం హజరత్తయ్య గుప్తా అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అంతర్జాతీయ సేవా ప్రశంస చెవరాన్ అవార్డును గుప్తాకు ప్రదానం చేశారు.

9న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు



కార్యదర్శి పి.కోటిలింగమ్మకు సమ్మె నోటీసు అందజేస్తున్న సోమేశ్వరరావు, కార్మికులు

విజయవాడరూరల్: పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని కోరుతూ జూలై 9వ తేదీన జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన పంచాయతీ కార్మికులతో కలిసి పాతపాడు పంచాయతీ కార్యదర్శి పి.కోటిలింగమ్మ, పి.నైనవరం కార్యదర్శి ఎస్.సంతోష్, అంబాపురం కార్యదర్శి డి.శ్రీనివాసరావు సమ్మె నోటీసులను అందజేశారు. అనంతరం సోమేశ్వరరావు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులందరికీ వేతనాలు పెంచాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని ఆయన కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి చట్టాలు మార్పు చేయడం, కార్పొరేట్ కంపెనీలకు అనుకూలమైన నిర్ణయాలు చేయడం జరుగుతుందని, దీని వలన కార్మికులు ఎంతో నష్టపోతున్నారన్నారు. బీజేపీ తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పాతపాడు గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు దుర్గారావు, శంకర్, శ్యామ్ కుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన రోడ్డు విస్తరణ పనులు



డ్రెయిన్ నిర్మాణానికి జరుగుతున్న పనులు

గన్నవరం: స్థానిక గన్నవరం – ఆగిరిపల్లి ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సుమారు రెండు నెలలు క్రితం ప్రారంభించిన పనులు ఇప్పటికి ఓ కొలిక్కి రాలేదు. దీంతో అస్తవ్యస్తంగా మారిన రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, రోడ్డు పక్కన గోతులు తవ్వి వదిలివేయడంతో దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు ఏప్రియల్‌లో ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరణ పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా సర్వే నిర్వహించి మార్కింగ్ చేసిన వరకు ఆక్రమణలను తొలగించారు. విస్తరణ పనుల కోసం ఏళ్ల తరబడి రోడ్డు పక్కన కూరగాయలు, పండ్లు, పూలు, టీస్టాల్స్, సైకిల్ షాపు, చెప్పులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న వారిని బలవంతంగా ఖాళీ చేయించారు. తొలుత వీరందరికి ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. అనంతరం విస్తరణ పేరుతో దుకాణాల సరిహద్దు వరకు రోడ్డును తవ్విన అధికారులు రెండు నెలలుగా పనులు చేపట్టకుండా వదిలివేశారు. దీంతో వ్యాపారాలు లేని పరిస్థితి.

శాఖల మధ్య సమన్వయ లోపం..

రెవెన్యూ, గ్రామ పంచాయతీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. సంబంధిత శాఖ అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరించడంతో ప్రజలు సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఒత్తిడి మేరకు వారం రోజుల వ్యవధిలో విస్తరణ పనులకు అడ్డుగా ఉన్న జాతీయ నేతల విగ్రహాలను తొలగించారు. మహాత్మాగాంధీ, ఎన్టీఆర్ కొత్త కాంస్య విగ్రహాలు ఏర్పాటు నిమిత్తం పాత విగ్రహాలను తొలగించేశారు. ఇటీవల రోడ్డుకు ఇరువైపులా సీసీ డ్రెయినేజీ నిర్మాణం నిమిత్తం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మార్కింగ్ పనులు పూర్తిచేశారు. దీంతో నిర్దేశించిన హద్దుల మేరకు డ్రెయిన్ నిర్మాణం నిమిత్తం పొక్లెయిన్‌తో గోతులు తవ్వుతున్నారు. అయితే దుకాణాలు ఎదుట డ్రెయిన్ కోసం భారీగా గోతులు తవ్వుతున్న అధికారులు ఎప్పటికి పూర్తి చేస్తారోనని సందేహాలను సదరు వ్యాపారులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి త్వరితగతిన విస్తరణ పనులు పూర్తిచేయాలని వ్యాపారులు కోరుతున్నారు.

నున్న హైస్కూల్ విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు



పి.రాజేష్



జి.ప్రణతి



కె.కారుణ్య



పి. భవ్యశ్రీ



జి.సంధ్య



బి.వరుణ్‌తేజ

నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారు. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యుత్తమ మార్కులు సాధించిన వీరు ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకోగా, మెరిట్ లిస్ట్‌లో సీట్లు పొందారు. పాఠశాలకు చెందిన పి.రాజేష్, కె.కారుణ్య, పి.భవ్యశ్రీ, బి.వరుణ్‌తేజ, జి ప్రణతి, జి.సంధ్యలకు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేస్తుండటంతో పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారన్నారు. ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ గడ్డం కుమార్, వైస్ చైర్మన్, సభ్యులు, ఉపాధ్యాయులు ట్రిపుల్ ఐటీ సీట్లు పొందిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఎనికేపాడులో విద్యుత్ స్తంభాల ఏర్పాటు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు కొడాలివారి వీధిలో బుధవారం నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలోని పాత స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి నూతన విద్యుత్ లైన్ల ప్రక్రియ పూర్తి చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు మాట్లాడుతూ.. పాత పడి శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన స్తంభాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నామని, అలాగే ఫ్యూజు బాక్సులు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ వలయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యుత్‌ను అనధికారికంగా వినియోగిస్తే చర్యలు తప్పవని ఏఈ హెచ్చరించారు.

నేడు పిన్నమనేనిలో సిజేరియన్ శస్త్రచికిత్సపై వర్క్‌షాప్

గన్నవరంరూరల్: మండలంలోని చినఅవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ప్రసూతి, గైనకాలజీ విభాగం, విజయవాడ ప్రసూతి, గైనకాలజీ సొసైటీ(వీఓజీఎస్) సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సిజేరియన్ శస్త్రచికిత్సపై ప్రత్యక్ష శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సజన గోగినేని తెలిపారు. ఆధునిక ప్రసవ శాస్త్రంలో కీలకమైన ఎల్ఎస్‌సీఎస్‌పై సుదీర్ఘ అనుభవం కలిగిన డాక్టర్ మహేష్ గుప్తా సారథ్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ప్రసూతి విభాగంలో ఉన్న వైద్యులు, పీజీ, మెడికల్ విద్యార్థులు ఈ శిబిరం ద్వారా విలువైన జ్ఞానం, ప్రాక్టికల్ అవగాహన పొందవచ్చని తెలిపారు. ఈ శిబిరాన్ని కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ పి.సుధా నాగేశ్వరరావు ప్రారంభిస్తారని చెప్పారు.

విద్యార్థులు పట్టుదలతో విజయం సాధించాలి



ప్రసంగిస్తున్న చరణ్ లక్కరాజు

పెనమలూరు: ఇంజినీరింగ్ విద్యార్థులు కృషి, పట్టుదలతో విజయం సాధించాలని స్టూడెంట్స్ ట్రైబ్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో చరణ్ లక్కరాజు అన్నారు. సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో బుధవారం బీటెక్ మొదటి సంవత్సరం చేరిన వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చరణ్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదవాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. పరిశ్రమలకు అవసరమైన స్కిల్స్ విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ డి.రాజేశ్వరరావు, ప్లేస్‌మెంట్ అధికారి కె.శ్రీనివాస్, ఫస్టియర్ ఇన్‌చార్జి డాక్టర్ కొల్లా నరేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రసరమ్యంగా మాండలిన్ కచేరి

విజయవాడ కల్చరల్: స్వరఝరి నెల వారీ సంగీత కార్యక్రమంలో భాగంగా శివరామకృష్ణక్షేత్రంలోని భారతీ తీర్థ శ్రవణ సదనంలో బుధవారం అంతర్జాతీయ సంగీత విద్వాంసుడు ఎస్.సుభాని నిర్వహించిన మాండలిన్ కచేరీ శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటింది. నాటకుంజి రాగం నాటవర్ణంతో ప్రారంభించి శ్రీ మహాగణపతిం, శివనుక్కు ఇళయసేవే, త్యాగరాజ స్వామి రచించిన ఎందరో మహానుభావులు, అఖిలాండేశ్వరి ముత్తుస్వామి దీక్షితార్ కీర్తన, సింధుభైరవి రాగంలో ధిల్లానాను ఆలపించారు. యువ సంగీత కళాకారులు అంబటిపూడి కామాక్షి, వయోలిన్‌పై, కార్తికేయ ఆదినారాయణ మృదంగంపై, గుంటూరుకు చెందిన మార్టూరి హరిబాబు ఘటంపై సహకరించారు. మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ సుభాని త్రోవకుంట హసన్, షేక్ చినమౌలానా వద్ద సంగీతంలో శిక్షణ తీసుకున్నారని తెలిపారు. మాండలిన్‌తో పాటు గిటార్, బాంజో, బజాకీ లాంటి సంగీత ప్రక్రియలలో ప్రతిభను చూపుతున్నారన్నారు. అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్, అన్నవరపు రామస్వామి పాల్గొన్నారు.

వరి సాగులో మెలకువలు పాటించండి



ఉంగుటూరు పొలం పిలుస్తోందిలో పాల్గొన్న అధికారులు, రైతులు



కోలవెన్నులో సూచనలిస్తున్న ఏవో ఉషారాణి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: సార్వా వరి సాగులో రైతులు మెలకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు తెలిపారు. బాపులపాడు మండలం శేరినరసన్నపాలెంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో విత్తన ఎంపిక, విత్తన శుద్ధి, నారుమళ్ల సాగులో అవలంభించాల్సిన విధానాలను రైతులకు వివరించారు. భూసార పరీక్ష ఫలితాలను అనుసరించి ఎరువులు వినియోగించాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బిల్లులు తీసుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ ఎ.ఆంజనేయులు, ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి లీల రంగమ్మ పాల్గొన్నారు.

ఉంగుటూరు(గన్నవరం): మండలంలోని ఉంగుటూరు, నాగవరప్పాడు గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి జి.రమేష్ ఖరీఫ్ వరి సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు వివరించారు. వరి సాగులో చీడపీడల నివారించేందుకు రైతులు తప్పనిసారిగా విత్తనశుద్ధి చేయాలని చెప్పారు. రైతులకు అవసరమైన ఎరువులు అన్ని పీఏసీఎస్‌ల్లో, ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏఈఓ బి.దుర్గానాగేశ్వరరావు, వీఏఏ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: వరి నాట్లు సమయంలో రైతులు జాగ్రత్తలు వహించాలని మండల వ్యవసాయాధికారి వెలివెల ఉషారాణి సూచించారు. మండలంలోని పునాదిపాడు, కోలవెన్ను గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సాగు చేసిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ వరి నాట్లు సమయంలో పొలానికి గాలి, వెలుతురు తగిలేలా నాట్లు వేయాలన్నారు. ఇష్టానుసారంగా ఎరువులు వినియోగించవద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీనివాస్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.